بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 13 February 2026 (Telugu)

# హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం
# స్వచ్ఛమైన దాసుని దైవ ప్రార్థనల ఆసక్తికర మరియు విశ్వాసభరిత ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 13.02.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ
نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

ఈ కాలంలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఆదర్శాన్ని అత్యధికంగా అనుసరించిన దృశ్యాలు వారి సల్లల్లాహు అలైహి వసల్లం యదార్థ దాసుడైన హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం వారిలో మనకు కనిపిస్తాయి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఆరాధనలు మరియు దానికి సంబంధించిన ఉపదేశాల గురించి గత ఖుత్బాలలో వివరించబడ్డాయి.

నేడు నేను హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఆరాధనలకు సంబంధించిన కొన్ని సంఘటనలను సమర్పిస్తాను. ఇవి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారిని అనుసరించడంలో మనకు కనిపిస్తాయి.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజియల్లాహు అన్హు గారు ఇలా ఉల్లేఖించారు. హజ్రత్ మిర్జా మహమ్మద్ దీన్ రజియల్లాహు అన్హు గారు నాకు ఇలా వ్రాసి పంపారు. నేను నా చిన్నతనం నుండి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారిని చూస్తూ వస్తున్నాను. మొట్టమొదటిసారిగా నేను వారిని హజ్రత్ మిర్జా గులాం ముర్తజా గారి జీవిత కాలంలో చూశాను, అప్పుడు నేను కేవలం చిన్నపిల్లాడిని. రాత్రి ఇషా ప్రార్థన తర్వాత త్వరగా నిద్రపోవడం మరియు రాత్రి ఒంటి గంట ప్రాంతంలో తహజ్జుద్ నమాజ్ కోసం లేవడం ఆయన అలవాటు. తహజ్జుద్ నమాజ్ చదివిన తర్వాత పవిత్ర ఖుర్ఆన్ పఠనం చేస్తూ ఉండేవారు. ఉదయం అజాన్ వినిపించగానే నమాజ్ కోసం మసీదుకు వెళ్ళేవారు మరియు జమాఅత్‌తో కలిసి నమాజు చేసేవారు. కొన్నిసార్లు స్వయంగా నమాజ్ చేయించేవారు, మరికొన్ని సార్లు మసీదు ఇమామ్ అయిన మియాఁ జాన్ మహమ్మద్ గారు నమాజ్ చేయించేవారు. నేను వారిని మసీదులో సున్నత్ నమాజ్‌లు చదవగా చూడలేదు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా ప్రవచించారు. నేను ఎన్నడూ కఠినమైన తపస్సులు చేయలేదు లేదా ప్రస్తుత కాలంలోని కొందరు సూఫీల్లాగా నా ఆత్మను తీవ్రమైన పోరాటాలలోకి నెట్టలేదు.

ఏకాంతవాసాన్ని నియమంగా చేసుకుని ఎన్నడూ చిల్లా (నలభై రోజుల ఏకాంత ప్రార్థన) చేయలేదు. అలాగే సున్నత్‌కు విరుద్ధంగా, దైవ వాక్యం అభ్యంతరం తెలిపేలాంటి ఏ సన్యాస క్రియను నేను ఎప్పుడూ చేయలేదు.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రవచించారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం తమ తండ్రిగారి మరణ కాలం నాటి తమ ఆధ్యాత్మిక సాధనకు సంబంధించిన ఒక సంఘటనను వివరంగా తెలియజేశారు. అందులో తాము ఒక పుణ్యాత్ముని కలలో చూశామని ఆయన ఆకాశపు వెలుగుల స్వాగతం కోసం కొన్ని ఉపవాసాలు పాటించడం ప్రవక్తల కుటుంబ ఆచారం అని పేర్కొన్నారని తెలిపారు. ఇంకా హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) ఇలా ఉపదేశించారు. కాబట్టి నేను కొంతకాలం పాటు ఉపవాసాలు పాటించడం సముచితమని భావించాను. అదే సమయంలో ఈ విషయాన్ని గోప్యంగా ఉంచడం మేలని తలచి, నేను ఒక పద్ధతిని అవలంభించాను. ఇంట్లో నుండి మగవారు కూర్చునే గదికి భోజనం తెప్పించి, దానిని కొందరు అనాథ పిల్లలకు పంచిపెట్టేవాడిని. మరల హుజూర్ (అ) ఉలా తెలిపారు. అల్లాహ్ తఆలాకు తప్ప మరెవరికీ ఈ ఉపవాసాల గురించి తెలియదు. ఆ తర్వాత రెండు మూడు వారాల అనంతరం ఆహారాన్ని మరింత తగ్గించి రోజంతా కేవలం ఒకే ఒక రొట్టె తినే స్థాయికి తీసుకువచ్చాను. ఆపై ఆహారాన్ని ఇంకా ఎంతగా తగ్గించానంటే, రెండు మూడు నెలల చిన్న పాప కూడా అంత తక్కువ ఆహారంపై ఓపిక పట్టలేడు. ఈ విధంగా ఎనిమిది తొమ్మిది నెలల పాటు ఉపవాసాలు పాటించారు.

ఆ సమయంలో ఉపవాసాల అద్భుతాలలో భాగంగా వారి (అ) అనుభవంలోకి చాలా విషయాలు వచ్చాయి. ఈ ఉపవాసాల ఫలితంగానే అనేకమంది ప్రవక్తలతో మరియు దైవమిత్రులతో సమావేశాలు జరిగాయని వారు పేర్కొన్నారు. అనంతరం వారిలా వివరించారు. ఒకసారి నేను పూర్తి మెలకువ స్థితిలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను, హజ్రత్ హసన్ మరియు హుస్సేన్ (రజి), హజ్రత్ అలీ రజియల్లాహు అన్‌హు మరియు హజ్రత్ ఫాతిమా రజియల్లాహు అన్‌హాలతో కలిసి చూశాను. ఇది కల కాదు, ఇది ఒక రకమైన మెలకువ స్థితి.

హుజూరె అన్వర్ తమ ఖుత్బాలో ఇంకా ఇలా ప్రవచించారు. ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది. ఒకసారి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం మేడ పైనుండి క్రింద పడిపోయారు. స్పృహ రాగానే ఆయన అడిగిన మొదటి మాట నమాజ్ సమయం అయిందా లేదా? అని. అంటే ఆయనకు నమాజ్ పట్ల అంతటి ప్రేమ ఉండేది.

క్రీ.శ. 1895 సం॥లో హజ్రత్ మీర్ ముహమ్మద్ ఇస్మాయిల్ రజియల్లాహు అన్‌హు గారికి రమజాన్ మాసాన్ని ఖాదియాన్‌లో గడిపే అవకాశం లభించింది. అప్పుడు ఆయన నెలంతా తహజ్జుద్ నమాజ్‌ను (అంటే తరావీహ్ నమాజును) హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) వారి వెనుక ఉండి చదివారు. ఆయన ఇలా వివరిస్తారు. హుజూర్ (అ) వారు విత్ర్ నమాజును రాత్రి మొదటి భాగంలోనే చదువుకునేవారు

మరియు తరావీహ్ నమాజ్‌ను రెండేసి రకాతుల చొప్పున రాత్రి చివరి భాగంలో చదివేవారు.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు రజియల్లాహు అన్హు గారు, హజ్రత్ అమ్మా జాన్ రజియల్లాహు అన్హా గారి ద్వారా ఇలా ఉల్లేఖించారు. హుజూర్ అలైహిస్సలాం ఐదు పూటల నమాజులే కాకుండా, రెండు రకాల నఫిల్ నమాజ్‌లు చదివేవారు. ఒకటి ఇష్రాక్, ఇది వారు అప్పుడప్పుడు చదివేవారు. రెండవది తహజ్జుద్ నమాజ్ ఎనిమిది రకాతులు, దీనిని వారు ఎల్లప్పుడూ చదివేవారు. తీవ్రమైన అనారోగ్యంతో ఉన్నప్పుడు తప్ప దీనిని ఎప్పుడూ వదిలేవారు కాదు. ఒకవేళ అనారోగ్యం వల్ల లేవలేని స్థితిలో ఉన్నా, పడకపై పడుకుని ఉండగానే దుఆలు చేసుకునేవారు. చివరి వయసులో బలహీనత కారణంగా కూర్చుని దుఆలు చేసేవారు.

హజ్రత్ మౌల్వీ యాఖూబ్ అలీ రజియల్లాహు అన్హు గారు ఇలా వ్రాశారు: వారు అలైహిస్సలాం కోర్టు కేసుల పని మీద వెళ్ళినప్పుడు కేవలం తమ తండ్రిగారి ఆజ్ఞను పాటించడం కోసమే వెళ్ళేవారు. అక్కడ కూడా వారు ఏ ఒక్క నమాజ్ కూడా తప్పిపోకుండా ఎంతో జాగ్రత్త వహించేవారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారి స్వరంలో ఎంతో ఆర్తి మరియు వేదన ఉండేవి. ఆయన (అ) పవిత్ర ఖుర్ఆన్ పఠనం ఎంతో లయబద్ధంగా ఉండేది. ఆయనకు పవిత్ర ఖుర్ఆన్ మరియు మహా ప్రవక్త గారి సున్నత్ పట్ల అమితమైన ప్రేమ ఉండేది. ఆయన ఆరాధనలు ఎన్నడూ దైవ ప్రవక్త గారి అనుసరణకు విరుద్ధంగా ఉండేవి కావు. నమాజ్‌తో పాటు ఆయన నిత్యం పవిత్ర ఖుర్ఆన్ పఠనం, దురూద్ షరీఫ్ మరియు ఇస్తిగ్ఫార్ (పాపక్షమాపణ) చేసేవారు. పవిత్ర ఖుర్ఆన్ పట్ల ఆయనకు గాఢమైన అనురాగం ఉండేది. పగలు, రాత్రి, కూర్చున్నప్పుడు, నిలబడినప్పుడు మరియు నడుస్తున్నప్పుడు కూడా ఆయన పవిత్ర ఖుర్ఆన్ పఠించేవారు మరియు భోరున విలపించేవారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం నమాజ్ కోసం మసీదుకు వెళ్ళలేని పక్షంలో, ఇంట్లోనే జమాఅత్‌తో చేసేవారు మరియు అటువంటి సందర్భాల్లో తరచుగా మా అమ్మగారిని (హజ్రత్ అమ్మా జాన్ రజియల్లాహు అన్హా) కూడా తనతో పాటు నమాజ్‌లో చేర్చుకునేవారు.

హుజూరె అన్వర్ ఇలా ఉపదేశించారు. హజ్రత్ షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ గారు (రజి) హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారి చిన్ననాటి కాలం గురించి ఇలా ఉల్లేఖించారు. హుజూర్ (అ) తనతో సమాన వయస్సు ఉన్న బాలికతో (ఆమెతోనే తర్వాత వివాహం జరిగింది) తన కోసం దుఆ చేయమని చెబుతూ ఓ అమాయకురాలా! దేవుడు నాకు నమాజ్‌ను ప్రసాదించాలని నా కోసం ప్రార్థించు' అనేవారు. ఈ మాటను బట్టి చిన్నప్పటి నుండే ఆయన భావాలు ఎంత పవిత్రంగా ఉండేవో మనకు అర్థమవుతుంది.

హుజూర్ (అ) ఇలా ప్రవచించారు. నేను చిన్నప్పటి నుండే ఉపవాసాలు పాటించడం అలవాటు చేసుకున్నాను.....నేను (బాల్యంలో) ఇరవై తొమ్మిది ఉపవాసాలు పూర్తి చేసినప్పుడు, ఆ రోజు నా సంతోషానికి అది ఒక పెద్ద పండుగలా ఉండేది. ఉపవాసాలకు ప్రత్యేకమైన శుభాలు ఉంటాయి. ప్రతి

పండుకు ఒక ప్రత్యేక రుచి ఉన్నట్లే, ప్రతి ఆరాధనలోనూ ఒక ప్రత్యేకమైన మాధుర్యం ఉంటుంది. ఈ ఆరాధనలలో ఆధ్యాత్మికత ఉంటుంది, దానిని మనిషి మాటల్లో వివరించలేడు. ఆరాధనలో మనిషి ఆత్మ అత్యంత కోమలంగా మారి, నీరులా ప్రవహించి దేవునిలో కలిసిపోవాలి.

హజ్రత్ పీర్ సిరాజుల్ హక్ నుఁమానీ గారు (రజి) దివంగత మియాఁ జాన్ మహమ్మద్ గారి అంత్యక్రియ నమాజ్ గురించి ఇలా ఉల్లేఖించారు. హుజూర్ (అ) కు మరణించిన వ్యక్తి పట్ల అపారమైన ప్రేమ ఉండేది. హుజూర్ (అ) స్వయంగా అంత్యక్రియ నమాజ్ చేయించారు. ఆ నమాజ్ ఎంత సుదీర్ఘంగా సాగిందంటే, వెనుక ఉన్న నమాజీలు నిలబడి, నిలబడి వారి కాళ్ళు నొప్పులు పుట్టాయి. నా పరిస్థితి అయితే నిలబడలేక దారుణంగా తయారైంది. అంత్యక్రియ నమాజ్ ముగించుకుని తిరిగి వచ్చాక, ఎవరో ఇలా విన్నవించారు. హుజూర్! ఈ రోజు నమాజ్‌కు చాలా సమయం పట్టింది, మేము బాగా అలసిపోయాము. మరి మీ పరిస్థితి ఏమిటో? అందుకు హుజూర్ (అ) ఇలా సమాధానమిచ్చారు: మాకు అలసటతో సంబంధం ఏమిటి? మేము అల్లాహ్ తఆలాతో దుఆలు చేస్తున్నాము, ఆ దివంగతుని పాపక్షమాపణ కోసం అతన్ని వేడుకుంటున్నాము. అడిగేవాడు ఎప్పుడైనా అలసిపోతాడా? ఎవరైతే అలసిపోతారో వారు వెనకబడిపోతారు. మేము అడిగేవాళ్ళం, అల్లాహ్ తఆలా ఇచ్చేవాడు. అటువంటప్పుడు అలసట ఎందుకు? ఎక్కడైతే స్వల్పమైన ఆశ ఉంటుందో అక్కడే యాచకుడు పట్టుబట్టి నిలబడతాడు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా మనకు కూడా ఇటువంటి ఆలోచనతో (తపనతో) నమాజ్‌లు చేసే భాగ్యాన్ని ప్రసాదించుగాక. మనం హజ్రత్ అక్దస్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారి బైఅత్ (ప్రమాణం) చేసేటప్పుడే అల్లాహ్ తఆలా మరియు అతని ప్రవక్త గారి ఆజ్ఞల ప్రకారం నమాజ్‌లు చేస్తామని ఒక నిబంధనను అంగీకరించాము. అల్లాహ్ తఆలా చేసిన ఉపకారాలను గుర్తు చేసుకుంటూ అతన్ని స్తుతిస్తూ నమాజ్‌లు చేయాలి. అల్లాహ్ తఆలా మనందరికీ ఈ వాగ్దానాన్ని నిలబెట్టుకునే శక్తిని ప్రసాదించుగాక.

ఖుత్బా చివరలో హుజూరె అన్వర్ ఇద్దరు దివంగత వ్యక్తుల గురించి ప్రస్తావించారు. వారి పరోక్ష అంత్యక్రియల ప్రార్థన చదివిస్తానని ప్రకటించారు మరియు మృతుల పాపక్షమాపణ కోసం, వారి ఉన్నత స్థాయిల కోసం దుఆ కూడా చేశారు.

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔